# ఇంటిలోని పోరు

కృష్ణారావుగారికేమీ తోచటంలేదు, ఈ పరిస్థితులలో ఎలా ప్రవర్తించాలో తనకు తగిన సలహా ఇవ్వడానికైనా భార్యామణి దగ్గరలో లేదు. హఠాత్తుగా, చైనాదాడిలా, ఈ క్లిష్టసమస్య ఎదురైంది. తన కైతే వయస్సు ఏభై ఆరుంది గాని ఇంత వరకూ తను ఇలాంటి సందిగ్ధ పరిస్థితిలో పడలేదు. ఎవర్నీ ఏమీ అనడానికి వీలులేదు. అటు, మేడ మీద గదిలో అద్దెకుంటున్న రమణారావులో పెద్ద చెప్పుకోదగ్గ లోపాలేంలేవు, అంటే మనిషిలో కాదుగాని అతని ప్రవర్తనలో. ఇటు సుశీలా, భారతీ, చేస్తున్న ఫిర్యాదుల్ని తోసి వెయ్యడానికి వీలులేదు. వీళ్లూ పాపం చాలా ఇబ్బందులు పడుతున్నారు. సుమారు మూడునెలల క్రిందటే భారతి మొదలెట్టింది, రమణారావుకి అద్దెకివ్వడం తాముపొరపాటు చేశామని. తను ఏదో విధంగా తన కూతుళ్లిద్దరికీ సర్ది చెప్తూకు వస్తున్నాడు. చివరకు అక్కా చెల్లెళ్లిద్దరూ ఒక్కసారి గొడవ పెట్టడం ప్రారంభించారు, ఏమైనా సరే వెంటనే రమణారావు తమగది ఖాళీ చెయ్యాల్సిందే నని. కాని రమణారావు ససేమిరా తను ఖాళీ చెయ్యనంటున్నాడు. గట్టిగా అతనికి చెప్పడానికి కృష్ణారావుగారు, అతను తిరగబడి మొండిగా కదల్నని దెబ్బలాడుతాడేమోనని భయం.

ఇన్ని సంవత్సరాలనుండి కాలేజీ విద్యార్థులకు తమ మేడ మీద గది అద్దెకిస్తున్నారుగాని, రమణారావు లాంటి విద్యార్థి

లెవరూ తమకు తటస్థపడలేదు. అందరితోనూ చాలా సాఫీగా గడిచిపోయింది. కాని రమణారావుతో అన్నీ సమస్యలే!

అప్పుడే ఆఫీసునుంచి తిరిగివచ్చిన భారతి, బాత్ రూమ్‌లో, కాళ్లు కడుక్కోవాలని ప్రవేశించి అక్కడ ఖాళీగావున్న డ్రమ్మునీ, ప్రక్కన చెంబు లేకపోవడమూ చూసి, పళ్లుమండినదై "చూశారా నాన్నగారూ, అతనిపని, నీళ్లన్నీ ఖాళీ చేశేసాడు. పైగా మన చెంబు తీసికెళ్లి తనగదిలో పెట్టుకున్నాడు. అసలితన్ని ఖాళీ చేయించమని వందసార్లు మీకు చెప్పాను. మీరు నామాట అసలు వినరు. నేనీబాధ పడలేను. ప్రొద్దున్నకు ప్రొద్దున్నా మనం పట్టుకున్ననీళ్లన్నీ ఖాళీ చేసేస్తాడు మన చెంబు వాడు కుంటాడు. పెద్ద జమిందార్లమని చెప్పుకుంటాడు, రూపాయి పావలా చెంబు కొనుక్కోడు. ఇదంతా మనల్ని అల్లరి పెట్టడం కాకపోతే ఏమిటి చెప్పండి? మీరు వెంటనే అతన్ని గది ఖాళీ చెయ్యమని చెప్పకపోతే లాభంలేదు" అంది తండ్రితో చాలా కోపంగా. అసలు భారతికి కోపం ఎక్కువ. సన్నగా, ఎర్రగా అందంగావుండే ఇరవై ఏళ్ల భారతి, 'ఆశాపరేఖ్'లా వుంటుందని కొందరి యువకుల విలువైన అభిప్రాయం. ఆమె పి.యు. సి పాసయి అక్కడే ఒక ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తోంది.

"అలాగేనమ్మా. ఇవాళే తప్పకుండా అతనితో చెప్పి త్వరలో నే ఖాళీ చేయించేస్తాను" అన్నారు కృష్ణారావుగారు. ఆయన చాలా అమాయకులు. ఎవరిమాటనూ కాదనలే

మన స్తత్వం ఆయనది. భార్యగాని కూతుళ్లుగాని ఆయన ఎడల ఎక్కువ లక్ష్యం చూపించరు. ఆయనకు గట్టిగా కోపంవస్తే ఆయన పెద్దగా అరుస్తూ మాట్లాడుతారు. అలాంటప్పుడు వాళ్లు ఆయనకన్నా గట్టిగా మాట్లాడుతారు. దాంతో ఆయన నోరు కట్టుబడిపోతుంది. ప్రస్తుతంలో ఆయన భార్య పుట్టింటికి వెళ్లడం వలనా, ఆయన పుత్రుడు ఉద్యోగరీత్యా పరాయి వూళ్లో ఉండటంవలన ఈ కష్టకార్య నిర్వహణాభారం ఆయన మీద పడింది.

బ్రిటిష్ వాళ్లను మనదేశంనుంచి వెళ్లిపొమ్మని, అంటే మనదేశం ఖాళీ చెయ్యమని చెప్పడానికి ఎంత ధైర్య సాహసాలు కావలసి వచ్చాయో, అందులో కొంతైనా రమణరావుని తమ రూముకాళీ చెయ్యమని అడగడానికి అవసరమయ్యాయి. ఎందుకంటే రమణరావు సామాన్య విద్యార్థికాదు. మొదటి విషయం బాగా (శ్రీమంతుల బిడ్డ! అంటే చిన్నవాడేం కాదులెండి. పాతికేళ్ల దరిదాపుల్లో బి ఏ పరీక్షకు కడ్తున్నాడు—బిడ్డ తండ్రే కాదగిన వయసుంది). ఇహ కాలేజీ యూనియను సెక్రటరీ అవడంవల్లా, అతని వద్దకు అనవరతమూ వచ్చిపోయే విద్యార్థులతో అతని రూముని డి ఉండడంవలనా, ఒంటరిగా సాధారణంగా దొరకడు. అథవా తెగించి ఏదైనా చెప్తే, ఆ రూముకు తను వచ్చిన తరువాత అల్మారు తలుపులూ, కిటికీ తలుపులూ కొత్తవి వేయించడం, ఒక నెలఅద్దె అడ్వాన్సుగా ఇచ్చిందికాక, మళ్ళీ కృష్ణారావుగారు తనవద్ద (భార్యా బిడ్డలకు తెలియకుండా)

తీసుకున్న ఇరవై రూపాయల చేబదులూ, వగైరా విషయాలు మాట్లాడుతాడు.

అసలు రమణారావు చాలా పట్టుదల మనిషి. జీవితంలో బి. ఏ. పాసయి తీరుతానని పట్టుబట్టాడు. అందుకు నాలుగేండ్ల నుండీ కృషి చేస్తున్నాడు. కాని అతని టెన్నిస్ ఆటలోవున్న ప్రజ్ఞలో పదోవంతైనా చదువులో లేకపోవడ వలన పరీక్ష పాసు కాలేక పోతున్నాడు. ఏమయితేనేం, అతను పాసవడం వలన అతనికి వచ్చే కట్నం సంఖ్య పెరుగుతుంది కాబట్టి, తండ్రి కూడా అతనిని నిరుత్సాహపరచలేదు.

కాలేజీలో రమణారావుఅంటే లెక్చరర్లకు గిట్టదు. ప్రిన్సిపాలుగారు ఇతనిని కాలేజీలోనుండి బయటకు వెళ్లగొట్టట మెలాగా? అని ఆలోచిస్తూనే ఉన్నాడు. ఎందుకంటే ఒకసారి, మాటా మాటా వచ్చి, 'ఇక్కడ మీరు ప్రిన్సిపాలుగాని, బయటికివస్తే మీరూ రమణారావే, నేనూ రమణారావే మీ గొప్పేముంది?'' అనిగాడు-- ప్రిన్సిపాలుగారి పేరు కూడా రమణారావే!.

డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చు పెట్టాడుగాబట్టి విద్యార్థుల కలిసి రూము ఒక యాత్రాస్థలమైపోయింది. రమణారావుకి ముఖ్య స్నేహితుడు వర్మ అతని వయస్సు పద్దెనిమిది సంవత్సరాలు. అతను ఇంగ్లీషులో కవిత్వం చెబుతాడు. ఉపన్యాసం చేస్తాడు. అతనూ సంపన్నుల ముద్దుబిడ్డే. అతను, కాలేజీ బ్యూటీ

అయిన మంజూరాణిమీద ఇంగ్లీషులో పద్యాలు రాశాడు. అతనిని చూసి రమణరావు పొంగిపోతాడు కాలేజీ తెరచి ఆరు నెలలయిందో లేదోగాని ఇప్పటికి, మూడుసార్లు స్ట్రైయిక్ చేశారు విద్యార్థులు, రమణరావు ఆధ్వర్యంలో, వర్మ సారథ్యంలో. అసలు గట్టిగా మాట్లాడితే తను కృష్ణారావుగారింట్లో ఉండడం వలన కృష్ణారావుగారికే గౌరవమంటాడు రమణరావు. 'ఆ గౌరవం మాకొద్దు బాబోయ్, నువ్వు దయచెయ్యి!' అని చెప్పడం, కృష్ణారావుగారికి చేతకాదు, కారణమేమంటే ఆయన భార్య కాపురానికి వచ్చింది మొదలు, ఆయన మాటలో 'ధాటీ' అనేది లేకుండా పోయింది. చాలాకాలం క్రిందట ఆయన యవ్వనంలో అడుగిడిన తొలి రోజుల్లో ఆయనలో కొంత దూకుడూ, పంతం, డబాయింపూ నగ్గిరావి ఉండేవిట. అవన్నీ పెళ్లయిన కొద్ది రోజుల్లోనే హుూష్‌కాకి అయిపోయి, 'మీకేం తెలియదు, మీరూరుకోండి, అసలు నేనన్నమాట కాదనడానికి మీరెవరు?' అంటూ రెచ్చిపోయే భార్యామణి ముందర, 'సరేలేవే, నీఇష్టం వచ్చినట్లే కానీ' అని బ్రతిమాలుకోవడంగానే ఆయన జీవితమంతా గడుస్తోంది. అలాటి కృష్ణారావుగారిని, రమణరావులాంటి కాలేజీ విద్యార్థిని, రూమ్ ఖాళీ చెయ్యమని చెప్పే గొప్ప క్లిష్ట కార్య నిర్వహణకి నియోగించడం ఎంత దారుణం!

దెయ్యమూ, దారుణ సముద్రమూ మధ్య చిక్కుకున్న మానవపుణీలా, అటు రమణరావూ, ఇటు సుశీలా భారతులూ

కృష్ణారావుగారికి భయంకరశత్రుల్లా, దాపురించారు. మొదట్లో కొన్ని నెలలు ఎంతో మర్యాదగా ప్రవర్తించిన రమణారావు, ఈమధ్యనే కొద్దిగా వీళ్లను తిప్పలు పెట్టడం ప్రారంభించాడు. అది కూడా చాలా చిన్న విషయాలలో మాత్రమే అతను మేడమీద రూములో ఉంటున్నాడు. మేడమెట్లవద్దనే బాత్ రూముంది. అది వాడుకునే హక్కు అతనికి మొదటినుంచీ ఇచ్చారు పెరట్లోవున్న బాత్ రూమ్ తాము వాడుకుంటామనే ఉద్దేశ్యంతో కృష్ణారావుగారు. కాని కారణాంతరాలవల్ల పెరటి వైపు వాటా మరొకరికి అద్దె కివ్వటంవలన, తాము కూడ వీధివైపు, మేడమెట్లవద్ద బాత్ రూము వాడుకోవలసి వచ్చింది. అందువల్ల ఇరుపక్షాలవారికీ కొన్ని ఇబ్బందులు ప్రారంభ మయ్యాయి.

ఊనులోవున్న కొళాయిలు, ఏకాస్సేపో నీళ్లిచ్చి, తరు వాత గప్‌చుప్‌గా వూరుకుంటాయి కాబట్టి, ఆ కాస్సేపూ శ్రద్ధ వహించి డ్రమ్ముునిండా పట్టుకున్న నీళ్లని, అద్దెకున్న వ్యక్తి అర గంట సేపు స్నానంచేసి ఖాళీ చేసేస్తే ఇంటివాళ్లకు వళ్లు మండ డం సహజమే. రమణారావు అలా చేస్తాడనే సుశీలా, భారతులకు కోపం. అంతేకాక రమణారావు రూము అనవరతమూ విద్యార్థు లతోనూ. వాళ్లు కాల్చే సిగరెట్టు పొగతోనూ నిండిఉండి, వాళ్ల అల్లర్లకు అంతం లేకపోవడమూ, మొదలైన కారణాలున్నాయి. పైగా వీళ్లు తనని ఖాళీ చెయ్యమనే ఉద్దేశ్యంతో ఉన్నారని

తెలిసిన దగ్గర్నుంచి రమణారావు పంతంగా వాళ్లకు వళ్ళుమండేట్టు ప్రవర్తించసాగాడు.

ఎలాగయితేనేం కృష్ణారావుగారు చివరికి తెగించి రమణారావుతో రూము ఖాళీ చెయ్యమని చెప్పారు. సూయజు కాలువ జాతీయం చేసినప్పుడు ఈడెన్‌కి, నాజర్ మీద ఎంత కోపం వచ్చిందో, రూము ఖాళీ చెయ్యమంటే కృష్ణారావుగారి మీద రమణారావుకి అంతికోపం వచ్చింది. దానికి జవాబుగా 'నాకు మరొక రూము దొరికినప్పుడు ఖాళీ చేస్తాను లెండి!' అన్నాడు నిర్లక్ష్యంగా, కోపంగా. ఆ క్షణం నుండి వీళ్ళని ఏడి పించాలని మరీ పంతంపట్టాడు రమణారావు. ప్రొద్దున్న ఆరున్నర కల్లా బాత్‌రూమ్‌లో నీళ్లు ఖాళీ చేసేసేవాడు. పైగా మేడ మీద, ఇవతల వరండాలో నుల్చుంటే, సుశీలా, భారతులు ఇంట్లో ఎక్కడున్నా కన్పిస్తారు. పూర్వం అసలటు వచ్చేవాడే కాదు. ఇప్పుడు ఇతని స్నేహితులు లరడజనుమంది అక్కడే ఇరవై నాలుగు గంటలూ మకాం వెయ్య నారంభించారు. మరో విశేషమేమంటే రమణారావుకి ఈమధ్య ఇద్దరు అతిథులు (అక్టో బరు పరీక్షకు వచ్చిన వాళ్ళు) కూడాను. వాళ్ళు నీళ్ళు తెగ వాడతారు. రాత్రి రెండింటిదాకా లైట్లువేసి చదువుతారు. ఆ లైట్లూ, ఆ గొడవతో సుశీలా, భారతులకు మతి పోయినంత పనైంది. ఆ అతిథుల్ని ఏమైనాఅంటే, రమణారావు ఇంటివాళ్ల మీద విరుచుకు పడ్తాడు.

ఒకనాడైతే భారతి ప్రొద్దున్న బాత్‌రూమ్‌లో ఖాళీ డ్రమ్మును చూసి, కండ్లవెంట నీళ్లు కార్చేసింది. ఆ క్షణంలో అతనిని రూము ఖాళీ చేయించమని తండ్రితో చెప్పింది. అంతేకాక అతను రూము ఖాళీ చేసేదాకా ఇంట్లో వంట చెయ్యననీ, తను భోజనం చెయ్యననీ పంతం పట్టింది. కృష్ణారావుగారు గాభరాగా వెళ్లి, మళ్లీ రమణరావుని అడిగాడు రూము ఖాళీ చెయ్యమని. తను రూము ఖాళీ చెయ్యడానికి మరొక రెణ్నెల్లయినా టైమ్ కావాలని నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు. పైగా, మాటి మాటికి తన వద్దకువచ్చి ఇలా చెప్పడం బాగులేదనీ, మళ్లీ ఆయన ఆ విషయం చెప్పడానికి వస్తే మర్యాద దక్కదనీ గట్టిగా చెప్పాడు. దానికి ఆయనకు కోపం వచ్చింది. గట్టిగా మాట్లాడసాగారు. అతనంతకన్నా గట్టిగా మాట్లాడాడు. పెద్ద గొడవయింది. ఒకవైపు రమణరావూ అతని స్నేహితులూ, మరొకవైపు క్రిష్ణారావుగారూ గట్టిగా కేక లేసుకొని వాదించు కోవడం ఆ వీధిలో వాళ్లంతా చూశారు. అరచి, అరచి, చివరకు చేసేదేమీలేక కృష్ణారావుగారు ఇంట్లోకి వెళ్ళిపోయారు. రమణరావూ, అతని స్నేహితులూ, అసలు ఆ రూము ఖాళీ చెయ్యనే వద్దనుకున్నారు. భారతి ఆరోజు భోంచెయ్యలేదుగాని వంటచేసింది. ఆ వీధిలోవున్న వాళ్లందరకూ చక్కటి చర్చ నీయాంశం దొరికింది! కొందరు రమణరావుకి రూము ఖాళీ చెయ్యొద్దని సలహా ఇచ్చారు. మరికొందరు కృష్ణారావుగారితో,

అతనిమీద పోలీసు రిపోర్టిమ్మనారు. కాని దానివలన అంత లాభం ఉండదేమోనని కూడా అన్నారు.

పిల్లిదరితో ఎవరి దగ్గర వాళ్ల మాటలు పలికారు వీధిలోని వాళ్లంతా. వాళ్ల కోరిక ఒక్కటే. ఈ మంట ఇంతతో చల్లారి పోకూడదు చల్లారితే వాళ్ల కానందం ఏదీ?

కృష్ణారావుగారు రమణారావు నిర్లక్ష్యానికీ, పొగరుబోతుతనానికి తనలో మండిపడ్డారు. తనేగనక, తల్చుకుంటే ఏమైనా చెయ్యగలననుకున్నారు—ఒంటరిగా కూర్చుని, తనలో! అసలు దగ్గరికివెళ్లి ఈ దవడా, ఆ దవడా, వాయగొట్టే ఏమ్చుకుంటూ పోడూ! అంతవాకా ఎందుకూ తనని రూము బయటికి వెళ్లమని రమణారావు అన్నప్పుడు, 'ఛో! ఇది నా ఇల్లు', అని మెడబట్టి బయటికి గెంటి, అక్కడనుంచి, మెట్లదగ్గర అతను నిల్చున్నప్పుడు మెట్లమీదనుండి క్రిందికితోసేస్తే అతను మెట్లమీద నుండి దొర్లుకుంటూ ప్రాణం వదిలెయ్యాడూ? అయినా, అసలంత పనెందుకు? అని వూరుకోవడంగానీ, అతన్ని తను చావగొట్టడం చాలా సులభం! వచ్చిన చిక్కల్లా మనది గాంధీ దేశం అయిపోయి, అహింసంటే పెద్దవాళ్లకి (కృష్ణారావుగారి లాంటి వాళ్లకు) బ్రహ్మాండమైన గురి ఏర్పడ్డంవలన ఇలాంటి పని చెయ్యబుద్ధి పెయ్యదు. కాని అంతమాత్రాన కృష్ణారావు గారిలాంటి వాళ్లను రమణారావులాంటివాళ్లు నిరసనగా చూడడం ఎంతమాత్రం తగదు. కాలం మారిపోయి పెద్దవాళ్ళంటే భయ

భక్తులు బొత్తిగా నశించినప్పుడు, ఈ కుర్రాళ్లతో తగువు తెచ్చుకోవడంకంటే వూరుకోవడం ఉత్తమం అనే నిర్ణయానికి వచ్చారు కృష్ణారావుగారు.

రమణరావుని ఖాళీ చేయించడం, తమ తండ్రికి అలివికాని పని అని సుశీలా భారతులు గ్రహించారు. వాళ్ళకి దిగులూ, నీరసం, విచారం అన్నీ ఒక్కసారిగా పట్టుకున్నాయి. ఈ పీడ వదిలిస్తే ఒకటి—ఒకటేమిటి అయిదు—కొబ్బరికాయలు కొట్టు కుంటామని ఆ ఏండుకొండలవాడికి మ్రొక్కుకున్నారు.

దేముడు దయదల్చి పంపించినట్లు, కృష్ణారావుగారి చెల్లెలు కొడుకు, సుబ్బారావు (బావ) కలకత్తానుంచి వైజాగ్ వెళ్తూ, ఒకపూట వీళ్లింట్లో ఉండిపోదామని వచ్చాడు. అతను వైజాగ్‌లో ఇంజనీరింగు చదువుతున్నాడు. భారతి అంటే అతనికి చాలా ఇది! (ప్రేమన్నమాట) అతను హడావుడిగా రైలుదిగి వచ్చిన కొద్దిసేపట్లోనే, రమణరావు గొడవంతా తెలిసిపోయింది. ఆ పూటే వెళ్ళిపోదామనుకున్నావాడు, వీళ్లను, అందులో ముఖ్యంగా భారతిని, ఈ స్థితిలో వదిలి వెళ్లడానికి మనసురాక రమణరావుతో చెప్పి ఖాళీ చేయించేసి మరీ వెళ్ళిపోతానని ఆగిపోయాడు. మరదళ్ళు చాలా సంతోషించారు.

ఇంజనీర్లు "డాములు కట్టటం, ఫ్యాక్టరీలు కట్టించి మెషీన్లు నడపటంలాంటి పనులు సులభంగా చెయ్యగలరుకాని, రమణ రావులాంటి యువకుల్ని రూము ఖాళీ చేయించాలంటే, చాల

కష్టపడాలి. ఆ విషయం రమణరావుతో మాట్లాడిన కొద్దిసేపటి లోనే తెలుసుకున్నాడు సుబ్బారావు. అసలు రమణరావుకి సుబ్బారావుని చూడగానే కోపం వచ్చింది. ఇతను రూము విషయం ఎత్తగానే "అసలు ఈ రూము నేను ఖాళీ చెయ్యనే చెయ్యను" అని గట్టిగా చెప్పాడు రమణరావు.

బలాబలాలు పరీక్షిస్తే, రమణరావులాంటి టెన్నిస్ ఛాంపియన్‌తో తను కుస్తీపట్టికూడా నెగ్గలేనని గ్రహించాడు సుబ్బారావు. అందువల్ల ఇతర ఉపాయాలని అన్వేషించవలసి వచ్చింది. ఆ రాత్రంతా సుబ్బారావు హృదయం, కుతకుత ఉడికి పోయింది. ఛ! ఎంత 'ఇన్సల్టు!' భారతిముందు తను ఎలా తలెత్తుకు తిరగగలడు! రమణరావుని రూము ఖాళీ చేయిస్తానని ఆమెకు వాగ్దానం ఇచ్చినవాడు అది సాధించే సాధన మేమీ కన్పించటంలేదు. అలా రాత్రంతా ఆలోచించగా, ఆలోచించగా అతనికి విషయమొకటి హఠాత్తుగా జ్ఞాపక మొచ్చింది. అదేమి టంటే, రమణరావు రూములో ఒక ఫోటో ఉంది. అది శ్రీ సత్య సాయిబాబాగారిది. అంటే రమణరావు సత్యసాయిబాబాగారి భక్తుడన్నమాట! వెంటనే సుబ్బారావుకి మధ్యాహ్నం కృష్ణా రావుగారు చెప్పిన మాటలు జ్ఞాపక మొచ్చాయి. కొన్ని నెలల క్రితం రమణరావు శ్రీ సత్యసాయిబాబాగారి జన్మదినోత్సవం రెండురోజులు గొప్పగా జరిపాడట. అంటే రమణరావు నిశ్చ యంగా బాబాగారి భక్తుడన్నమాట.

ప్రక్కింట్లో సూర్యారావుగారని ఒక స్కూలుమాష్టరు గారు కాపురం ఉంటున్నారు. ఆయన తల్లి రాధమ్మగారు బాబా గారి భక్తురాలు. రమణరావుకి వాళ్ళకి బాగా పరిచయం ఉంది. వాళ్ళతో సంప్రదించి రమణరావు నెలా ఖాళీ చెయ్యాలో నిర్ణయించాలనుకున్నాడు సుబ్బారావు. ఆ విషయం కృష్ణారావు గారివద్ద కదిపితే ఆయన "అబ్బే! ఈ కాలపు కుర్రాళ్ళకు బొత్తిగా భయభక్తులు లేవురా. పెద్దలంటే గౌరవంలేదు. దేవుడంటే భక్తీ లేదు. లేకపోతే నన్నన్ని మాటలంటాడా? బాబా గారి పూజలని హడావుడి చేశాడుగాని ఇతనేం భక్తుడు?" అని కొట్టిపారేశారు.

అయినా సుబ్బారావు వూరుకుందామనుకోలేదు. ఏదో విధంగా రమణరావుని బయటికి కదపాలనుకున్నాడు. మెల్లిగా సూర్యారావుగారింటికి వెళ్ళి, పూర్వపరిచయం ఉండడంవలన వాళ్ళింట్లో అందర్నీ పలకరించాడు. రాధమ్మగారికి ఏభై అయిదేళ్ళుంటాయి. పచ్చని శరీరచ్ఛాయా, గుండని మొహం, చిరునవ్వుతో మంచితనం ఉట్టిపడే వ్యక్తి ఆమె. సుబ్బారావుని ఆప్యాయంగా పలకరించింది. కొద్దిసేపు ఇవీ అవీ మాట్లాడాక రమణరావు గొడవంతా ఆమెతో చెప్పాడు "అవునవును, మేమూ కొంతవిన్నాం" అన్నారావిడ.

"రెండు రోజులనుండి మా మరదళ్ళు భోంచెయ్యటం లేదండి. అతను పరమరౌడీలాగ ప్రవర్తిస్తున్నాడు".

"రమణరావు తిక్కమనిషే. అయినా పాపం ఈ ఆడపిల్ల లెందుకు వస్తుంటారు. అతనలాటివాడు కాదే" అందామె.

'కాదనుకోండి. అయినా అతను పెట్టున్న తిప్పలు చాలు' అని సుబ్బారావు, రమణరావూ, అతని స్నేహితులూ చేస్తున్న గోలంతా చెప్పాడు. సూర్యారావూ, రాధమ్మగారూ చాలా సానుభూతి చూపించారు.

తరువాత సుబ్బారావు. పార్కులోకి వెళ్లి కాస్సేపు పచార్లు చేశాడు. నేటికాలపు యువకుల మొండితనం గురించి తెగ విచారించాడు. తనూ యువకుడే అయినప్పటికీ తనలోవున్న అణుకువా, విధేయతా ఎంతో ప్రశంసనీయమని అంతా మెచ్చుకుంటున్నారు. తను ఏనాడైనా ఏ విషయానికైనా పెద్దవాళ్ళకెదురుచెప్పలేదే. ఇంతకీ తనలోని మంచితనాన్ని అన్నివిధాలా మెచ్చుకుంటున్న భారతి తను గనక రమణరావుని రూము ఖాళీ చేయించలేకపోతే, చాతకాని వాణ్ణనుకుంటుందేమో నన్న భయ కూడా సుబ్బారావుకి ఎక్కువయింది.

మెల్లిగా అడుగులేసుకుంటూ ఇంటికి దిగులుగా వచ్చిన సుబ్బారావుకి. భారతి ఎదురుగావచ్చి, "ఎక్కడికెళ్లావ్ బావా? ఎంతసేపటికి కాఫీకి వచ్చావు కావు" అని ఆప్యాయంగా పలకరించేసరికి హృదయం తేలికై పోయింది.

"అబ్బే అలా పార్కులోకెళ్లాను. ఈ విషయమే ఆలోచిస్తున్నాను ఈ రమణరావుని..." అని మెల్లి గా అంటూంటే

సుశీలా, భారతు లిద్దరూ ఒక్కసారి, "ఆ విషయం ఇంక ఆలోచించవద్దు బావా. అతన్ని ఉంటే ఉండనీ, అందువల్ల మన కేమీ నష్టంలేదు" అన్నారు. సుబ్బారావు ఆశ్చర్యపోయి, తన చెవుల్ని తనే నమ్మలేకపోయాడు. వీళ్ళైనా ఈమాట అంటూంది! ఏమిటి విపరీతం?

"ఏమిటి మీర నేది? రమణారావు ఖాళీ చెయ్యక పోయినా ఫరవాలేదా? మరి ఇంతవరకూ..."

"ఆ౽ పోనిద్దూ ఎవరిగొడవ వాళ్ళది. అతని అలవాట్లతనివి. అదిసరేగాని మే మిద్దరం మా స్నేహితురాలింటికి పేరంటం వెళ్లొస్తాం, కొంచెంసేపు ఉండు, నాన్నగారుకూడా బజారునుంచి వస్తారు" అని సుశీలా, భారతు లిద్దరూ సరదాగా బయటికి వెళ్లారు.

సుబ్బారావుకి మతిపోయినట్లయింది. ఎంత ఆలోచించినా కథ అలా అడ్డంతిరగడానికి కారణమేమిటో బోధపడలేదు 'క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్' అని వ్రాసిన కవి వాక్యం అమోఘమూ, అనుభవపూరితమూ, ననుకున్నాడు. అయినా వాతావరణాం ఇలా మారిపోవడానికి తగిన కారణం ఉండి ఉంటుందనికూడా అనుకున్నాడు.

మరికొద్దిసేపటిలోనే ఆ కారణం సుబ్బారావుకి బోధపడింది. బజారునుంచి వచ్చిన కృష్ణారావుగారితో పాటు మరొక వ్యక్తికూడా వచ్చాడు. ఆయనకు అరవైయ్యేళ్లుంటాయి. గ్లాస్కో పంచెమీద, సిల్కుచొక్కాపైన నల్ల ఉలెన్‌కోటు

వేసుకున్న తెల్లని సన్నని వ్యక్తి. చేతిలో నాజూకైన చేతికర్ర ఉంది. ఆయన వస్తూనే సుబ్బారావుని వందప్రశ్నలు వేశాడు. ఆయన వాగ్ధోరణి అమోఘం. కృష్ణారావుగారిని 'బావగారూ' అని పిలుస్తూండడంవలన, తనకు తెలియకపోయినా దగ్గిరచుట్టం అయి ఉంటాడని సుబ్బారావు ఆయనతో బాగానే మాట్లాడాడు.

"ఏం చదువుతున్నావు నాయనా?"

"ఇంజనీరింగు"

"ఇతనేం ఇంజనీరుగాని బావగారూ, మా రెండో అమ్మాయి కొడుకు శశి, ఎంత గొప్ప ఇంజనీరవుతాడో చెప్ప లేం. ఇంట్లోవున్న వస్తువులన్నీ పాడుచేసేస్తాడు. ఏమన్నా అంటే 'మరామ్మత్తు చేస్తున్నా' నంటాడు. వాడివయస్సు ఆరేళ్ళు. కాని ఇంట్లో రేడియో పలక్కపోయినా, ఫాన్ తిరక్కపోయినా, ఒక స్క్రూడ్రైవరుపుచ్చుకు బయల్దేరుతాడు. వాడి మొహంలో హెన్రీఫోర్డు పోలికలున్నాయి. అటు గొప్ప ఇంజనీరూ, ఇటు ధనికుడూ కాగలడని నా నమ్మకం. అసలు మా మనవలంతా ఇంజనీర్లే. మా అమ్మాయిలు ఎటువంటి తెలివిగల వాళ్లు! మా పెద్దమ్మాయి తెలివితేటలు బ్రహ్మాండం. పెళ్ళై పదేళ్ళయినా ఇంకా మా అల్లుడికి ఇంట్లో ఏ వస్తువు ఎక్కడుందో తెలియదు. అలా సర్దేస్తుంది, ఇంటిని మా పెద్దమ్మాయి. ఏదేనా వస్తువు కావాలంటే 'మాజిక్కు' చేసినట్లు తీస్తుంది ఏ కుర్చీ క్రిందనుండో. ఇదీ ఇంజనీరింగంటే. అసలు మా పెద్దమ్మాయి మొహంలో గ్రేటాగార్బో కళ ఉంది..."

సుబ్బారావు చెవులు గింగురెత్తాయి. ఎంతసేపువిన్నా ఆయన మనమలూ, కూతుళ్లూ, అల్లుళ్లూ వీళ్ల గురించి గొప్పలుదంచేస్తూ జోరుకొట్టేస్తున్నాడు. కృష్ణారావుగారివేపు చూశాడు, ఆయన లోలోపల భరించరానిబాధ ననుభవిస్తున్నట్లు మొహం పెట్టారు. కానీ ఏం లాభం? ఈ చుట్టం వదిలేట్టు లేడు. మూలనున్న పెట్టే బెడ్డింగు చూడగానే, కొద్ది రోజులుతిష్ట వెయ్యడానికి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రసంగాన్ని మార్చాలని ఎన్నిసార్లు ప్రయత్నించినా, ఆయన మళ్ళీ మళ్ళీ తన కూతుళ్ళూ మనవలవద్దకే ప్రసంగ ధోరణి తిప్పుతున్నాడు. వాళ్లల్లో ఇంజనీర్లూ, డాక్టర్లూ కాదగిన లక్షణా లున్నాయి. రూజ్వెల్టూ, చర్చిలూ, గేరీకూపరూ మొదలైన వాళ్ళ పోలికలు వాళ్ళలో ఉన్నాయి. ఒక గంట వాళ్ల వర్ణన అయ్యాక ఆయన "మా నెహ్రూని మీ రెరగరు గాని, మీ భారతికీ వాడికీ ఈడూ జోడూ సరిపోతుంది..."

షాక్ తిన్నట్లు అయ్యాడు సుబ్బారావు, ఎవరీ నెహ్రూ!

"వాడికి వంట్లో బాగుండక బి. యస్‌సి. పోయిందిగాని, అసలు నెహ్రూగారి పేరు పెట్టినందుకు ఆయన తెలివి తేటలన్ని వాడికి వచ్చాయి. నేను వాడి పేరు పెట్టినప్పుడు, ఎందుకైనా మంచిదని ఇద్దరు నాయకుల పేర్లు జోడించి జయప్రకాశ్ నెహ్రూ" అని పేరుపెట్టాను. బయట వాళ్లు నెహ్రూ అని పిలుస్తారు. ఇంట్లోవాళ్ళు జయప్రకాశ్ అంటారు. అన్నట్లు, బావగారూ, ఆ మేడమీద రూములో కుర్రాణ్ణి ఖాళీ చెయ్యమని

చెప్పారా. రేపే మావాడు వస్తున్నాడు. ఈరెండు నెలలూ, నేనూ మా అబ్బాయి, మీ కిబ్బందిలేకుండా ఆ రూములో ఉంటాము...''

శ్రీరామచంద్రా! ఇదా ఈయన రాకకి అర్థం—అను కున్నాడు సుబ్బారావు అదే నిజమయితే వేరే 'హింస' అక్కర లేదు! అందుకన్నమాట, భారతి అలా మాట్లాడింది! ఈ పరమ బోరాగ్రేసరుడైన' బంధువుకన్నా, ఆ రమణరావే నయమను కుంది.

దీక్షితులుగారి మాటకు (ఆయన పేరు) కృష్ణారావుగారు, "ఎంత చెప్పినా అతను ఖాళీ చెయ్యటంలేదు. చేస్తే మీ కివ్వ డానికి నాకేం అభ్యంతరంలేదుగాని...'' అన్నారు మెల్లిగా. ఆయన సుబ్బారావు కూడా మనస్సుల్లో 'రమణరావు ఇప్పట్లో ఖాళీ చెయ్యకుండా ఉంటుగాక!' అని కోరుకుంటున్నాడు. ఎందుకంటే రమణరావు ఖాళీ చేస్తే ఆ రూము సెప్టెంబరు పరీక్షకు వెళ్తున్న దీక్షితులుగారి అబ్బాయికి, బంధుత్వ మొహ మాటంవల్ల ఇచ్చి తీరాలి. దానివల్ల అద్దె నష్టం మాట అటుంచి, దీక్షితులుగారి బోరు నెవరు భరించగలరు? ఇంటిలోని 'బోరు' కన్నా, మేడమీదహోరే నయం. కానీ దీక్షితులుగారు కోతలు కొయ్య సాగారు...తను మూడు నిముషాల్లో రమణ రావుని ఖాళీ చేయిస్తానని.

ఆయన కాపుకదా, ఆయన తలలోని జేజెమ్మ దిగివచ్చినా రమణరావుని ఖాళీ చేయించలేరనే ధైర్యముతో, కృష్ణారావు గారూ ఆయన కూతుళ్ళూ కూడా రూము ఖాళీ అయితే తప్పక దీక్షితులగారికిస్తామని అన్నారు. ఆరాత్రి సుబ్బారావు, భారతీ సుశీలలతో సరదాగా మాట్లాడి, తను మర్నాడు హాయిగా రైలెక్కేస్తానన్నాడు.

మర్నాడు ప్రొద్దున్న వాళ్ల నాశ్చర్యపరిచే దృశ్య మొకటి ఎదురైంది. బాత్‌రూములో డ్రమ్ము, నీళ్లతో నిండుగా ఉండడమేగాక, రమణారావు రూము ఖాళీ చేస్తున్నాడు. ఇంటిల్లిపాదీ తెల్లబోయారు. ప్రక్క వీధిలోనే రూము దొరికిందనీ, వెళ్లిపోతున్నానని అతను చెప్పడానికి వస్తే, వాళ్ళకు పిడుగు పడ్డట్లయింది. రమణరావు ఖాళీ చెయ్యడానికి కారణం కూడా చెప్పేశాడు. 'రాధమ్మగారి కోరికమీద, ఆమె ఎడలగల గౌరవంకొద్దీ నేను మీ రూము ఖాళీ చేసేస్తున్నాను" అన్నాడు, వెళ్ళిపోతూ. ఈ విషయంలో రాధమ్మగారి సహకారం అర్థించనందుకు, సుబ్బారావు తనను ఎంతో తిట్టుకున్నాడు.

ఇంట్లోని యావన్మందీ మౌనంగా వూరుకున్నా దీక్షితులు గారు మాత్రం తనకు తోచిన మాటలనేశారు, "ఈ రోజుల్లో కుర్రాళ్ళకు భయభక్తులు లేవనుకుంటాంగాని నిజంగా వాళ్ళ కున్న భక్తిశ్రద్ధ లెవరికీ ఉండవు ఆమె చెప్పడం, ఈ యువకుడు ఖాళీ చెయ్యడం, చాలా ప్రశంసనీయం. అందుకే నేను మా

పిల్లలకు దేశ నాయకుల పేర్లు పెట్టాను. మా నెహ్రూ ఎంత బుద్ధిమంతుడో చెప్పలేం. వాడిలో సుభాష్‌బోసు పోలికలున్నాయని అనుకునేవాళ్ళం..." అని ఆయన చెప్తూంటే భారతీ, సుశీలల మొహంలోని దీనత్వం చూసిన సుబ్బారావు బాధతో కృంగిపోయాడు. భవిష్యత్తు నూహించుకుంటూ కృష్ణారావు గారు భార్యామణికి ఒలిఁగా మివ్వడానికి నిశ్చయించారు.

